క్లుప్తంగా

ముగ్గురు బాలకార్మికుల గుర్తింపు



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు

రేణిగుంట: పట్టణంలోని వివిధ షాపుల్లో పని చేస్తున్న ముగ్గురు బాలకార్మికులను మంగళవారం తిరుపతి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ గుర్తించి, వారిని వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించారు. ఆపరేషన్ స్వేచ్ఛ–4లో భాగంగా మంగళవారం కార్మిక శాఖ, పోలీసు, చైల్డ్ లైన్, ఐసీడీఎస్, ప్రగతి సంస్థలు సంయుక్తంగా షాపులను తనిఖీలు చేపట్టాయి. వివిధ షాపుల్లో పని చేస్తున్న 18 ఏళ్ల లోపు బాల కార్మికులు ముగ్గురిని గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి బాలకార్మికులను పనిలో పెట్టుకుని వెట్టి చాకిరీ చేయిస్తున్న దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా 18 ఏళ్ల లోపు బాల, బాలికలను పనిలో పెట్టుకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ ఎస్.చిన్న లాలెప్ప, సహాయ కార్మిక అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, ప్రవీణ్‌కుమార్, రంగనాథ్, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, ఎంఈఓ ఇందిరాదేవి, ఏఎస్ఐ పార్వతి, శ్రీధర్, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

బుచ్చినాయుడుకండ్రిగ : విద్యుత్ పొదుపు చేయడం అందరి బాధ్యతని ఏఈ చలపతి పేర్కొన్నారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్‌పై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఆదా చేయటం కోసం ప్రతి ఒక్కరూ త్రీ స్టార్ అంతకంటే ఎక్కువ స్టార్లు ఉన్న గృహోపకరణాలు వాడితే 30 శాతం విద్యుత్ పొదుపు అవుతుందన్నారు. దీనివలన వినియోగదారులకు విద్యుత్ చార్జీలు తగ్గుతాయని తెలిపారు. ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే ఒక యూనిట్ తయారు చేసినట్లేనన్నారు.

దారి సౌకర్యం కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ : రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని కాటూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడంగళ్ వన్ బీ, రిజిస్టర్ 22 (ఏ), భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే రికార్డుల్లో నమోదైన తప్పులు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం, కబ్జాలు తదితర సమస్యలు రెవెన్యూ సదస్సులో అర్జీలిస్తే అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు. శ్మశానానికి దారి లేకపోవటంతో అవస్థలు పడుతున్నామని, దారి సౌకర్యం కల్పించాలని కాటూరు గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య పాల్గొన్నారు.

సదస్సులతో సమస్యల పరిష్కారం

రేణిగుంట : రెవెన్యూ సదస్సుల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సురేష్‌బాబు కోరారు. మండలంలోని ఎస్‌యూ పురంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా మొత్తం అయిదు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. సదస్సులో సర్పంచ్ ఆవుల ముని వెంకట్రామిరెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఏర్పేడు మండలం మన్నసముద్రంలో తహసీల్దార్ భార్గవి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మెనూ అడిగి తెలుసుకున్నారు. ఆకుకూర లేకపోవడంపై సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథనాయుడు, మధునాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



ఎస్టీ కాలనీలో కాలిన పూరిల్లు

రేణిగుంట : మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం ఎస్టీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. చైతన్యపురానికి చెందిన వెంకట రమణయ్య టైల్స్ పని చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వెంకట రమణయ్య పనికి వెళ్లగా, అతని భార్య తిరుపతికి వెళ్లింది. పిల్లలు స్కూలుకు వెళ్లారు. అయితే మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా ఇంటిలో నుంచి దట్టమైన మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంట్లోని వస్తు సామగ్రి కాలిపోయాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



కలుజు పారుతున్న పాండూరు చెరువు



నిండుగా సంతవేలూరు చెరువు



పెద్ద పాండూరులో ప్రవహిస్తున్న రుద్రాక్ష మడుగు

అమ్మో తుపాన్

వారం రోజుల పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. రైతుల మోములో ఆనందం తొణికిసలాడింది. ఎన్నడూ లేని విధంగా ఫెంగల్ తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ ఏడాది నవంబర్ చివరి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోయినా డిసెంబర్‌లోనే రెండు సార్లు సంభవించిన తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురిశాయి. రబీ సీజన్‌లో ఎలాంటి సాగు నీటి ఇబ్బందులు తలెత్తవని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్న వేళ తాజాగా మరో తుపాన్ వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది.

- అల్పపీడన హెచ్చరికలతో జనం బెంబేలు
- ఆందోళనలో అన్నదాతలు
- వర్షాలతో నిండుగా చెరువులు, కుంటలు



పెద్ద పాండూరులో ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంట

వరదయ్యపాళెం : తుపాన్ కారణంగా వరుసగా కురిసిన భారీ వర్షాలకు చెరువులు పూర్తిగా కలుజులు పారుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో 7 మండలాల్లో 270కి పైగా చెరువులు ఉండగా ఇవన్నీ కలుజులు పారుతూ వేసుకున్న పంటలకు భరోసానిస్తున్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌కు సత్యవేడు నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ సమాచారం. అయితే ఈ పంట పూర్తిగా ప్రస్తుత వర్షాలకు పంట చేతికొస్తుందని ఒక వైపు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరి పంట దెబ్బతినే అవకాశం

డిసెంబర్ మాసంలో ఇప్పటికే రెండు పర్యాయాలు తుపాన్ కారణంగా భారీ వర్షాలు సంభవించాయి. మరోమారు బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రభావంతో ఈనెల నేటి నుంచి వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలపడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. గాలులతో కూడిన వర్షాలు సంభవిస్తే మాత్రం నియోజకవర్గంలోని 7 మండలాల్లో సగానికి పైగా వరి పంట నేలమట్టమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక పలు చెరువులకు గండ్లు పడే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితే వస్తే సత్యవేడు నియోజకవర్గం అతలాకుతలం అయ్యే అవకాశం ఉందని, తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని మరోవైపు ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదకరంగా ఆనకట్టలు

వరదయ్యపాళెం మండలంలో 8 సాగునీటి ఆనకట్టలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వీటికి వరద నీటి ఉధృతి పెరగడంతో ఆ ప్రాంతంలో ఆనకట్టలు ప్రమాదకరంగా మారాయి. ఈ ఆనకట్టల ద్వారా వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతం ఆయకట్టుకు నీరు ప్రవహిస్తోంది. ఆ మేరకు మండలంలో సంతవేలూరులోని పులిబగొంద, అంబూరులోని మార్లమడుగు, సీఎల్ఎన్‌పల్లి సమీపంలో చావాలి, కళత్తూరులోని పాముల కాలువ, కదూరు కూడలి వద్ద సున్నపుకాలువ, బత్తలవల్లం, మత్తేరిమిట్ట సమీపంలో పాత, కొత్త కరిపేటి కాలువలు, పెద్ద పాండూరు సమీపంలో రుద్రాక్ష మడుగు ఆనకట్టలు ఉన్నాయి. ఈ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మరో తుపాన్ వస్తే ఈ ఆనకట్టలు ప్రమాదకరంగా మారనున్నాయి.

దళిత హక్కులకు ఉద్యమిద్దాం

రేణిగుంట : హైదరాబాదులో జనవరి 5వ తేదీన జరగనున్న దళిత హక్కుల ఉద్యమం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కల్లయ్య పిలుపునిచ్చారు. రేణిగుంటలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం రెండో జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కల్లయ్య మాట్లాడుతూ.. దళితుల హక్కుల కోసం హైదరాబాదులో జనవరి 5న జరగనున్న జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, ఉపాధ్యక్షుడు తులసి రాజన్, నాయకులు డాక్టర్ బలరాం, తిరుమల, ఖాదర్ వల్లి, నాగరాజు, రహంతుల్లా, రాఘవయ్య, జయరాం పాల్గొన్నారు.

గాలిగోపురం చుట్టూ మట్టి తొలగింపు

శ్రీకాళహస్తి: భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని గాలిగోపురం చుట్టూ 60 అడుగుల మేర ఏర్పాటు చేసిన మట్టిని మంగళవారం తొలగించారు. రోడ్డు వెడల్పు అవసరమే గానీ అలాగే గాలిగోపురం రక్షణకు కూడా ఆలయం బాధ్యత వహించాలి. 500 సంవత్సరాల పూర్వం శ్రీకృష్ణదేవరాయలు గజపతిపై విజయం సాధించిన తర్వాత శ్రీకాళహస్తి విచ్చేసినప్పుడు విజయ చిహ్నంగా నిర్మించిన గాలిగోపురం 2010లో కూలిపోయింది. అయితే అనంతరం నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీ గాలిగోపురాన్ని పునఃనిర్మించింది. అనంతరం చుట్టూ ఆరు అడుగుల ఎత్తు 60 అడుగుల వెడల్పుతో గాలిగోపురం చుట్టూ గట్టు లాగా మట్టి ఏర్పాటు చేశారు. అయితే నిత్యం ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని గాలిగోపురం వద్ద రోడ్డును వెడల్పు చేస్తున్నట్టు ఆలయాధికారులు చెబుతున్నారు.అయితే భారీ వాహనాలను ఇటుగా అనుమతిస్తే గాలిగోపురం ఆ వైబ్రేషన్లతో దెబ్బతినే ప్రమాదం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాడ వీధుల్లో ఫ్లెక్సీలు కనపడలేదా?

– పుర అధికారులపై మాజీ చైర్మన్ ఆగ్రహం



మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన నేతల ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి : మాడ వీధుల్లో కట్టిన ఫ్లెక్సీలు పుర అధికారులకు కనపడ లేదా అని మాజీ పాలక మండలి చైర్మన్ అంజూర్ తారక శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. మాడ వీధుల్లో రాజకీయ నేతల ఫ్లెక్సీలు కట్టకూడదనే నిబంధనలు కూటమి నేతలకు వర్తించవా అని ప్రశ్నించారు. ధనుర్మాసంలో మాఢా వీధుల్లో జే గంట తిరుగుతుందని ఆధ్యాత్మికంగా ఉండాల్సిన మాడా వీధులు రాజకీయ ఫ్లెక్సీలతో నిండిపోయాయని ఆరోపించారు. గతంలో ఫ్లెక్సీలపై రాద్ధాంతం చేసిన కూటమి నేతలు ఇప్పుడు జాతర పేరుతో కట్టిన ఫ్లెక్సీలను వారం గడుస్తున్నా తీయక పోవడం బాధాకరమన్నారు. ఊరి బయట ఎక్కడైనా వైసీపీ ఫ్లెక్సీలు కనిపిస్తే పుర అధికారులు , సచివాలయ ఉద్యోగులు వెంటనే వాటిని తొలగిస్తున్నారని, మరి నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాళహస్తి మాడ వీధుల్లో వారం రోజులు గడుస్తున్నా ఫ్లెక్సీలను తొలగించకపోవడంపై పురపాలక అధికారులు తీరు అర్థమవుతోందన్నారు. వెంటనే ఫ్లెక్సీలు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

పింక్ బస్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే తగిన చికిత్స ద్వారా నివారించవచ్చునని, ప్రతి ఒక్కరూ పింక్ బస్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కాటూరు, వీయస్‌పురం గ్రామాల్లో ఉచితంగా పింక్ బస్ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈనెల 19వ తేదీ పల్లమాల, పార్లపల్లి, 20న తలారి వెట్టు, వెస్టువరత్తూరు, 23న ఆర్.అనంతపురం గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారని , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు విద్యాసాగర్, పద్మావతి, హరిత. సీహెచ్‌ఓ వెంకటేశులు, సర్పంచులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన తపస్య పాఠశాల విద్యార్థులు

రేణిగుంట : చిత్తూరులో జరిగిన జాతీయ గోజు– ర్యూ కరాటే పోటీల్లో రేణిగుంట డాక్టర్ బషీర్ తపస్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల అధినేత విక్రమ్ శాలి తెలిపారు. తమ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ 10, సిల్వర్ మెడల్స్ 9, బ్రాంజ్ మెడల్స్ 15 సాధించారన్నారు. మొత్తం 32 మంది విద్యార్థులు కుమితే (ఫైటింగ్), కటా విభాగాల్లో సత్తా చాటారని చెప్పారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ ముకుంద, విద్యార్థులను అధినేతతో పాటు డైరెక్టర్ అనూష అభినందించారు.

భూసమస్యలపై వినతులు

వరదయ్యపాళెం : రాచర్ల, కోవూరుపాడులో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు మ్యుటేషన్లు, భూసమస్యల గురించి వినతులు అందజేశారు. సర్పంచులు సుజాతమ్మ (యానాదివెట్టు), ఈశ్వరమ్మ (రాచర్ల), ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి, మండల సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ సంబరాలు



చర్చిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రేణిగుంట : మండలంలోని కరకంబాడి సమీపంలోని జాన్ లూథరన్ చర్చిలో రాస్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు రాస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఆదేశాల మేరకు 200 మంది మహిళలకు దుస్తులు, దుప్పట్లు, చేతి కర్రలు అందించారు. కరుణ, దయ, ఓర్పు, ఆప్యాయత, అనురాగాలు, పెద్దలను గౌరవించడమే జీసస్ శాంతి సందేశమని, అందరూ ఆయన చూపిన మార్గాన పయనించి లోక శాంతికి తోడ్పడాలని కోరారు. అనంతరం పిల్లలు ఏసు పుట్టుక స్క్రిప్ట్, పాటలతో అలరించారు. చర్చి ఫాదర్ విక్టర్, రాస్ సిబ్బంది నాగేశ్వర్, సత్యనారాయణ, రాణి, సుజాత, ఈశ్వరమ్మ , ప్రేమమ్మ, వనజాకుమారి, మరియమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ మార్పులపై విచారణ

– టౌన్ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు పులి రామచంద్ర డిమాండు

శ్రీకాళహస్తి : టీడీపీకి చెందిన ప్రైవేటు అతిథి గృహం కోసం గత మాస్టర్ ప్లాన్‌లోనే మార్పులు చేయడం అమానుషమని టౌన్ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు, వైసీపీ నేత పులి రామచంద్ర ఆరోపించారు. టీడీపీ నేత అతిథి గృహం ఆలయ మాస్టర్ ప్లాన్‌లో ఉండేదని రాజకీయ ఒత్తిడి తెచ్చి ఆ ప్లాన్‌లో మార్పులు చేసి ఆ భవనం తప్ప అన్ని కొట్టేశారని సోషల్ మీడియా వేదికగా మంగళవారం విమర్శించారు. ఈ విషయాన్ని అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ అతిథి గృహం భూమి క్రయ విక్రయాల్లో అనేక సమస్యలు ఉన్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపైన అనేక సార్లు ఈఓలకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ సంఘటనలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల దృష్టికి మళ్లీ తీసుకెళుతున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక ప్రగతి సాధించాలి



ర్యాలీలో మహిళా సంఘం సభ్యుల ప్రతిజ్ఞ

నాగలాపురం : ప్రతి కుటుంబానికి ఒక ఔత్సాహిక వేత్తను తయారు చేద్దామని డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం పిచ్చాటూరు, నాగలాపురం మహిళా మండల సమాఖ్య కార్యాలయాల్లో వెలుగు అధికారులు, సిబ్బంది, వీఓలతో పీడీ శోభన్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని డ్వాక్రా సంఘాలను మెరుగు పరిచి 'ఏ' గ్రేడు జాబితాలోకి తీసుకురావాలని కోరారు. మహిళా సంఘాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. రుణాలను పెట్టుబడిగా పెట్టి వ్యాపారాలు చేయడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. అనంతరం మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు , లింగ వివక్షపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ వేదనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పిచ్చాటూరు, నాగలాపురం ఏపీఎంలు చంద్రకళ, సీతారామయ్య, క్లస్టర్ ఎంపీఎం వాసు, సీసీలు, వీఓలు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల నిరసన



నిరసన తెలుపుతున్న వీధి వ్యాపారులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం వీధి వ్యాపారులు నిరసన చేపట్టారు. పట్టణంలోని మార్కెట్ వీధిలో కాలువ మీద 30 ఏళ్లుగా ఉన్న వీధి వ్యాపారుల కడుపు కొట్టవద్దని వాపోయారు. సీపీఐ నాయకులతో కలిసి పురపాలక సంఘం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా కాలువ మీదే వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తమకు ఎక్కడైనా స్థలం కేటాయిస్తే వెళ్లిపోతామని విన్నవించామని ఆ మేరకు టీడీపీ కార్యాలయం పక్కనే స్థలం కేటాయిస్తామని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, పార్కు నిర్మాణం జరుగుతున్నందు వల్ల ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ పక్కన కేటాయిస్తామని కొన్ని రోజులు చెప్పారన్నారు. గత వారంలో హఠాత్తుగా మా దుకాణల వద్దకు చేరుకుని పైన ఉన్న రేకులను తొలగించి విద్యుత్‌ను ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు విద్యుత్‌ను పునరుద్ధరిస్తే స్థలం కేటాయించే వరకు అక్కడే వ్యాపారం చేసుకుంటామని చెబుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, గోపి పాల్గొన్నారు.

దాతల చొరవ అభినందనీయం



ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం : పలు చోట్ల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకొస్తున్న దాతల చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని గోవర్ధనపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదికి గురుదేవ్, విజయలక్ష్మి దంపతులు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.1.50 లక్షల వ్యయంతో పలు పనులను చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. సంబంధిత తరగతి గదిని మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం : రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లో సత్తా చాటిన వరదయ్యపాళెం హైస్కూల్ విద్యార్థులు మోహనకృష్ణ, ఆకాష్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఎంఈఓ సరస్వతి, ఎంఈఓ–2 గున్నయ్య, సర్పంచ్ వీరభద్రం, వివిధ పార్టీ నాయకులు పన్నెం నిర్మల్, జయచంద్రనాయుడు, కరుణాకర్ నాయుడు, దశరథన్, వెంకయ్య, సిద్ధలయ్య, పురుషోత్తమ్, శ్రీను పాల్గొన్నారు.

పుర కార్మికులను తొలగించడం అన్యాయం



పురపాలక కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకుల ఆందోళన

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో కరోనా కష్ట కాలంలో పనిచేసిన 27 మంది కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయ మని ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్ పేర్కొన్నారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారికి వేతనాలు ఇవ్వలేమని కమిషనర్ చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. రోజుకు రూ.300 చొప్పున అయిదు నెలలుగా పనిచేసిన వారిని తొలగించాలనడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ప్రకటించారన్నారు. అయితే నేడు పురపాలక సంఘం కమిషనర్ అవేమీ పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం కమిషనర్ గిరికుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చి వారిని వెంటనే విధుల్లో తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి జీతం రాకపోతే ఏమి చేయలేనని కమిషనర్ చేతులెత్తేశారు. దీనిపై సీపీఐ నాయకులు గురవయ్య గోపి మాట్లాడుతూ .. ఈ విషయంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు

– మండల సమావేశంలో ఎంపీపీ ప్రతిపాదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు : మండలంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ ప్రతిమ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సత్యవేడు– ఊత్తుకోట రోడ్డు, సత్యవేడు– కన్నావరం , మాదరపాకం– ఆరూరు రోడ్డు అడుగుకో గుంత పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఏఈ ఇజ్రాయిల్ మాట్లాడుతూ.. 5 రోడ్ల మరమ్మతులకు రూ. 63 లక్షల ప్రతిపాదనలు పంపామన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. కొత్తమారి కుప్పం, నరసరాజు అగ్రహారంలలో సిమెంటు రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపాలని కోరారు. దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు స్థానికేతరులకు ఇస్తున్నారని, పంచాయతీ తీర్మానాలకు మాత్రం సర్పంచ్ అవసరం వచ్చిందా అంటూ మండిపడ్డారు. పనుల కేటాయింపులో ఐసీడీఎస్ అధికారుల జోక్యం లేదని సీడీపీఓ దేవకుమారి సమాధానం ఇచ్చారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో రోడ్డు ఆక్రమణతో వర్షపు నీరు రోడ్డుపై నిలుస్తోందని దాసుకుప్పం సర్పంచ్ తెలిపారు. దాసుకుప్పం, చెన్నేరి, శిరుణంబూదూరు, రాళ్లకుప్పం, కొల్లడం, సత్యవేడు వైసీ, సత్యవేడు ఎస్టీ కాలనీ, బాలకృష్ణాపురంలలో అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరాయని సీడీపీఓ సభ దృష్టి తీసుకొచ్చారు. రాచపాళెంలో పాఠశాల సమీపంలో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ రూబెన్ కోరారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ.. మండలంలో1504 పక్కాగృహాలు మంజూరు కాగా 680 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని సర్పంచ్ జయ కోరారు. తెలుగు గంగ కాలువలో 138–60 నుంచి 140 కిలో మీటర్ వద్ద లీకేజీని అరికట్టేందుకు రూ. 3 కోట్లు ప్రతిపాదనలు పంపామని తెలుగుగంగ డీఈ శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఎంఈఓ రవి, ఎంపీటీసీలు సరవనన్, బీబీఎస్ రెడ్డి, సరోజని, శెల్వి, ఇంద్రాణి, సుధాకర్, కోఆప్షన్ సభ్యురాలు మస్తాణి, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకారం



రేణిగుంట : మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

రేణిగుంట : నేరాల నియంత్రణకు సహకరించాలని బంగారు వ్యాపారులు, కుదువ వ్యాపారులకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మంగళవారం వ్యాపారులతో సమావేశమయ్యారు. దుకాణాల్లో విధిగా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా బంగారు ఆభరణాలను కుదవ పెట్టేందుకు వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలను గురించి వారికి వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాల నియంత్రణకు తోడ్పాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉన్న వారే వాహనాలను నడపాలని, లేకుంటే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గంజాయి అక్రమ రవాణా గురించి ఎలాంటి సమాచారం తెలిసినా తమకు తెలియజేసి నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. అర్బన్ సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయ మహిళా పోలీసు దేవి మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో దూరంగా ఉండాలని, చరవాణిలో ఆన్‌లైన్ గేమ్స్, అశ్లీల చిత్రాలు మొదలగు వాటితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. విద్యా విషయాలకు సంబంధించి తప్ప చరవాణిని ఎక్కువగా అలవాటు చేసుకోకూడదన్నారు.